క్లుప్తంగా

20వ తేదీ నుంచి ప్రత్యేక పశు వైద్య శిబిరాలు


డా..రాంబాబు

నర్సీపట్నం : ఈ నెల 20వ తేదీ నుంచి నెలాఖరు వరకు ప్రత్యేక పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని నర్సీపట్నం ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకులు డా..రాంబాబు తెలిపారు. నర్సీపట్నం, గొలుగొండ మండలాల్లోని అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. పశువులు, దూడ పెయ్యలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు అందిస్తామన్నారు. అనారోగ్యంతో ఎదకురాని, గర్భకోశ వ్యాధు లున్న పశువులకు ఉచితంగా చికిత్సలు అందిస్తామన్నారు. ప్రతి మండలంలో రోజుకు రెండు గ్రామాల్లో శిబిరాలు నిర్వహిస్తామన్నారు. శిబిరాల నిర్వహణకు పశు వైద్యాధికారి, పశు వైద్య సహాయకుడు, రైతు సేవా కేంద్రంలోని వైద్య సహాయకులతో రెండు బృందాలు ఏర్పాటు చేశామన్నారు. పాడి రైతులు పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చురుగ్గా మోదకొండమ్మ ఆలయ ప్రహరీ నిర్మాణం


చురుగ్గా సాగుతున్న ప్రహరీ పనులు

మాడుగుల రూరల్ : ఎం.కోడూరు గ్రామంలో గల మోదకొండమ్మ అమ్మవారి ఆలయ ప్రహరీ నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఎంపీటీసీ ముమ్మిన రమణబాబు మండల పరిషత్ నిధుల నుంచి ప్రహరీ నిర్మాణానికి రూ.2లక్షల నిధులను మంజూరు చేయించారు. ఈ నిధులతో జరుగుతున్న పనులను ఆయనతో పాటు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు, స్థానిక నాయకులు పడాల అప్పలనాయుడు పర్యవేక్షిస్తున్నారు. మరో 10 రోజుల్లో ప్రహరీ నిర్మాణం పూర్తి కానుందని ఎంపీటీసీ రమణబాబు తెలిపారు.

మంచు ముసుగులో పల్లెలు


కె.కోటపాడులో ఉదయం వేళల్లో కురుస్తున్న మంచు

కె.కోటపాడు : మండల గ్రామాల్లో ఉదయం వేళల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఉదయం 7 గంటల వరకు గ్రామాల్లో దట్టంగా పొగమంచు కురవడంతో ప్రయాణాలు చేసేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించలేక పోవడంతో వాహనలైట్లు వేసుకొని మరీ ప్రయాణాలను చేస్తున్నారు. ఈ శీతల ఉష్ణోగ్రతలతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

మాడుగుల: స్థానిక 30 పడకల ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. వైద్య సిబ్బంది పనితీరు మార్చుకోవాలని, రోగులకు నమ్మకం కలిగించేలా వైద్యం చేపట్టాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు. ఆస్పత్రి సేవలు మెరుగుపడాలని ఆయన ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.చంద్రశేఖర్‌కు చెప్పారు. ఆస్పత్రికి దంత వైద్యుడి అవసరం ఉందని వైద్యాధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆస్పత్రిలో ప్రసవాల గురించి ఎమ్మెల్యే ఆరా తీశారు. సమావేశానికి పారిశుద్ధ్య కాంట్రాక్టరు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. సమావేశంలో ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, వుప్పాల అప్పలరాజు, అద్దేపల్లి జగ్గారావు, ఎంపీడీవో కొంకి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదం చెంత... అసౌకర్యాల చింత


ఎత్తయిన రెండు కొండల మధ్యలోంచి జాలువారుతున్న జలపాతం


తుప్పలతో నిండి ఉన్న జలపాతం ప్రధానరోడ్డు

- అభివృద్ధికి నోచని సరుగుడు జలపాతం
- తండోపతండాలుగా వస్తున్న సందర్శకులు
- పర్యాటక కేంద్రంగా చేస్తే స్థానికులకు ఉపాధి


జలపాతానికి వెళ్లాలంటే ఈ గెడ్డ దాటాల్సిందే..

నాతవరం : సరుగుడు జలపాతం వద్ద సరైన సౌకర్యాలు లేకపోవడంతో సందర్శకులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

ఎత్తయిన రెండు కొండల మధ్యలోంచి ప్రవహించే సరుగుడు జలపాతాన్ని చూసేందుకు ఉమ్మడి విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో సందర్శకులు వస్తుంటారు. చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం నడుమ ఇక్కడి ప్రకృతి అందాలు ఆకట్టుకుంటాయి. అయితే ఈ జలపాతాన్ని చూడాలంటే సందర్శకులు ఎన్నో అవస్థలు పడాలి. సరుగుడు సుందరకోట గ్రామాల నడుమ అటవీప్రాంతంలో ఎత్తయిన కొండల నడుమ జలపాతం ఉంది. అక్కడకు వెళ్లడానికి రోడ్డు సదుపాయం లేదు. మట్టిరోడ్డులో గెడ్డలు దాటుకుంటూ వెళ్లాలి. సరుగుడు నుంచి సుందరకోట గ్రామం వరకూ తారు రోడ్డు నిర్మించారు. ఈ మధ్యలో రెండు కొండల నడుమ ఉన్న జలపాతాన్ని చేరాలంటే అక్కడ్నుంచి పూర్తిగా మట్టి గుంతలతో కూడిన రోడ్డు మాత్రమే ఉంది. ఏమాత్రం వర్షం పడినా ఈ రోడ్డంతా బురదగా మారుతుంది. మధ్యలో నిత్యం ప్రవహించే గెడ్డను దాటాల్సి ఉంటుంది. ఈ జలపాతానికి వెళ్లడానికి సందర్శకులు మార్గం తెలియక తికమక పడుతుంటే గిరిజనులు తాటిదుంగలతో ముఖద్వారం ఏర్పాటు చేశారు. జలపాతం వద్ద స్నానాలు చేసి దుస్తులు మార్చుకోవడానికి నిర్మించిన షెడ్డు పూర్తిగా శిథిలమైంది. జలపాతం దిగువ భాగంలో సందర్శకులకు ప్రమాదాలు జరగకుండా ఏర్పాటు చేసిన ఐరన్‌గ్రిల్స్ కూడా శిథిలమై ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఉమ్మడి జిల్లాలో పర్యటక శాఖ అధికారులు రూ.10 లక్షలతో నిర్మించిన షెడ్డు నిర్వహణ లేక అధ్వానంగా దర్శనమిస్తుంది. ఇన్ని అవస్థల నడుమ కూడా వేలాది మంది పర్యాటకులు ఈ జలపాతాన్ని సందర్శిస్తుంటారు. వారి సౌకర్యార్థం అక్కడ కనీస సదుపాయాలు కల్పించడానికి అధికారులు, పాలకులు చొరవ చూపడం లేదు. ఈ ప్రదేశాన్ని పర్యటక కేంద్రంగా తయారు చేస్తే గిరిజన ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఈ ప్రాంతీయలు చాలా కాలంగా వేడుకుంటున్నారు.

స్పీకర్‌కు వినతి

గత నెల 24వ తేదీన స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు సరుగుడు మీదుగా సుందరకోట గ్రామానికి విచ్చేశారు. ఆ సమయంలో సరుగుడు, సుందరకోట పంచాయతీలకు చెందిన 16 గ్రామాల గిరిజనులు ప్రధానంగా జలపాతాన్ని పర్యటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని స్పీకరు దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి రోజు అధిక సంఖ్యలో సందర్శకులు వస్తున్నారని జలపాతాన్ని పర్యటక కేంద్రంగా చేస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, స్థానికులకు ఉపాధి లభిస్తుందని కోరారు. ఈ మేరకు స్పీకరు హామీ కూడా ఇచ్చారు.


జలపాతానికి వెళ్లే దారిలో తాటి దుంగలతో గిరిజనులు ఏర్పాటు చేసిన ముఖద్వారం


శిథిలావస్థలో దుస్తులు మార్చుకునే షెడ్డు

అభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాలు



జలపాతాన్ని పర్యటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే మా గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. స్థానికంగా గిరిజనులకు ఉపాధి అవకాశాలు ఉంటాయని ఎంతో ఆశపడుతున్నాం. మా ప్రాంత గిరిజనుల కోరిక మేరకు సుందరకోటలో జరిగిన సభలో నేను స్పీకరు దృష్టికి ఈ అంశం తీసుకెళ్లాను. పర్యాటక కేంద్రంగా చేస్తే అనంతగిరి, లంబసింగి మాదిరిగా సందర్శకులు వస్తారు.

–సాగిన లక్ష్మణమూర్తి ఎంపీపీ

అపూర్వ సమ్మేళనం


హైస్కూల్‌లో 2003-2004 10క్లాస్ బ్యాచ్

నాతవరం : మండల కేంద్రమైన నాతవరం హైస్కూల్లో 2003–2004 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించుకున్నారు. హైస్కూల్లో కలియతిరిగి చిన్ననాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. చదువులు పూర్తి చేసుకుని ఏళ్లుగా వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా సమ్మేళనానికి విచ్చేయడంతో హైస్కూల్ ప్రాంగణమంతా సందడి నెలకొంది. శ్రీకోటమ్మతల్లిని దర్శించుకుని అక్కడే సంహపంక్తి భోజనాలు చేశారు. సాయంత్రం వరకు ఆట పాటలతో ఉత్సాహంగా గడిపారు. ప్రతి ఏటా ఇదే విధంగా సమ్మేళనం కావాలని, మనకు బోధించిన గురువులను సత్కరించాలని, హైస్కూల్‌కు కావలసిన మంచి కార్యక్రమం చేస్తే బాగుంటుందని సమావేశంలో తీర్మాణించారు.

ఆయుర్వేద వైద్యురాలిగా గ్రీష్మ బాధ్యతల స్వీకరణ


వైద్యురాలు గ్రీష్మ

దేవరాపల్లి : దేవరాపల్లి ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి వైద్యురాలిగా జి. గ్రీష్మ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయుర్వేద వైద్య సేవలను పునఃప్రారంభించారు. ఆయుర్వేద వైద్యాధికారి గ్రీష్మ మాట్లాడుతూ ఇకపై మండల ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ఆయుర్వేద సేవలందిస్తామని, మండల ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్ని రకాల వ్యాధులకు ఆయుర్వేద మందులు అందుబాటులో ఉంటాయన్నారు. ఆమె వెంట కె.కోటపాడు హోమియోపతి డాక్టర్ సుమన్‌లత ఉన్నారు.

సంబరంగా గౌరీపరమేశ్వర్ల ఊరేగింపు


గౌరీపరమేశ్వర్ల రథాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు కరక అప్పలరాజు, కమిటీ సభ్యులు


అమ్మవారికి సారె తీసుకెళ్తున్న మహిళలు


ఆకర్షణీయంగా ట్రాక్టరుపై తాటి కల్లు సెట్టింగ్

నాతవరం : మండల కేంద్రంలో గౌరీపరమేశ్వర్ల ఉత్సవాలు ఘనంగా ముగిసాయి. ఉత్సవాలు ఆఖరు రోజు గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు శ్రీగౌరీపరమేశ్వర్లను గ్రామంలో ఊరేగించారు. అమ్మవారికి తయారు చేసిన పిండి వంటకాలను మహిళలు సారె ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సీతారాములు, దేవతల వేషధారులు ఎడ్ల బండ్లపై ఊరేగింపుగా సంబరం చేశారు. ట్రాక్టరుపై ఏర్పాటు చేసిన తాటిచెట్టు నుంచి కల్లు తీయడం ఆకర్షణీయంగా నిలిచింది. శ్రీగౌరీపరమేశ్వర్ల ఊరేగింపు రథాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు, నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు లాంఛనంగా ప్రారంభించారు. ఉత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నాతవరం ఎస్‌ఐ సిహెచ్.భీమరాజు బందోబస్తును ఏర్పాటు చేశారు.

వీఆర్‌వోల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి


వీఆర్‌వోలకు క్యాలెండర్, డైరీలను పంపిణీ చేస్తున్న వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీరామమూర్తి

దేవరాపల్లి: వీఆర్‌వోల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వీఆర్‌వోల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఈర్లె శ్రీరామమూర్తి కోరారు. వీఆర్‌వోల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్. త్రినాథ రామకాసుతో కలిసి శుక్రవారం దేవరాపల్లి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆయన స్థానిక వీఆర్‌వోలతో సమావేశమయ్యారు. వీఆర్‌వోలు అందరికీ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను ఆయన అందజేశారు. వీఆర్‌వోల అపరిష్కృత సమస్యలను పరిష్కరించడంతో పాటు పని భారం తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హత కలిగిన వీఆర్‌వోలకు పదోన్నతి కల్పించి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతల శంకరరావు, జిల్లా జనరల్ సెక్రటరీ అనంతరామయ్య, అనకాపల్లి డివిజన్ అధ్యక్షుడు గణపతి, మండల సంఘ అధ్యక్షుడు బి. నాగేశ్వరరావు, కార్యదర్శి కర్రి జగదీష్ పాల్గొన్నారు.

ఘనంగా తీర్థ మహోత్సవాలు


పెద్దిపాలెంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న గ్రామ పెద్దలు


ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతుల అందిస్తున్న కమిటీ సభ్యులు

మాకవరపాలెం : గ్రామాల్లో తీర్థమహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ మేరకు శుక్రవారం నారాయణరాజుపేట, యరకన్నపాలెం, తూటిపాలలో రామాలయాల వద్ద తీర్థమహోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా చెక్క భజనలు, పూజలు నిర్వహించారు. పెద్దిపాలెంలో తీర్థం సందర్భంగా ముగ్గులతోపాటు వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామాల పెద్దలు వెంకటగిరి, సూరిబాబు, శ్రీను, చిటికెల బాబు పాల్గొన్నారు.

నేడు కె.జె.పురంలో సీతారాముల తీర్థం

మాడుగుల రూరల్ : మేజర్ పంచాయితీ కె.జె.పురంలో శనివారం సీతారాముల తీర్థ మహోత్సవాన్ని ఘనంగా జరపనున్నట్లు తీర్థ నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలను జరిపేందుకు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. రాత్రికి ఆలయం ఎదుట తోడపెద్దు సేవ జరగనుందని తెలిపారు.

గొలుగొండ : సంక్రాంతి సందర్భంగా మండలంలో జమ్మేదేవిపేట గ్రామంలో శుక్రవారం తీర్థ మహోత్సవం నిర్వహించారు. గ్రామంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి స్థానిక కమిటీ సభ్యులు బహుమతులు అందించారు. కొత్తపాలెం, దారంపాలెం గ్రామాల్లో కూడా ఘనంగా తీర్థాలు నిర్వహించారు.

నవోదయ పరీక్షకు ఏర్పాట్లు

మాకవరపాలెం : నవోదయ అర్హత పరీక్ష నిర్వహణకు స్థానిక ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని ఎంఈవో పి.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. కోటవురట్ల, మాకవరపాలెం మండలాలకు చెందిన 279 మంది విద్యార్థులు పరీక్ష రాసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. మొత్తం 12 గదులు, 13 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు చెప్పారు. ఉదయం 11.30 గంటలకు పరీక్ష ప్రారంభం అవుతుందని, గంట ముందు కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

నేడు సర్వసభ్య సమావేశం

మాకవరపాలెం : మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు. ఎంపీపీ రుత్తల లక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలన్నారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని, అధికారులు తప్పనిసరిగా హాజరవ్వాలని సూచించారు.

నేడు స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివస్

మాడుగుల : ప్రతి మూడో శనివారం సందర్భంగా స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రపరచాలని, ప్రభుత్వం ఆదేశించినట్లు ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. మండల స్థాయి, గ్రామ స్థాయి ప్రభుత్వ కార్యాలయాలు శుభ్రపరచాలన్నారు. ఈ కార్యక్రమాలు శనివారం ఉదయం 7 గంటలకు ప్రారంభించి స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని ఎంపీడీవో కోరారు.

మూడు గ్రామాల్లో తీర్థాలు


సింగన్నదొరపాలెంలో అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

కె.కోటపాడు : మండలంలో సింగన్నదొరపాలెం, గొట్లాం, చౌడువాడ గ్రామాల్లో గల ప్రజలు శుక్రవారం తీర్థ మహోత్సవాలను ఘనంగా జరిపారు. సింగన్నదొరపాలెంలో మరిడిమాంబ అమ్మవారి, గొట్లాంలో గల చింతాలమ్మ అమ్మవారి, చౌడువాడలో శ్రీకృష్ణుని తీర్థ మహోత్సవాలను జరిపారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో ఉదయం నుండే భక్తులు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. సింగన్నదొరపాలెం, గొట్లాం గ్రామాల్లో రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఎ.కొత్తపల్లిలో ఘనంగా ముత్యమాంబ తీర్థం


ఎ. కొత్తపల్లి ముత్యమాంబను దర్శించుకుంటున్న ఎంపీపీ బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ సత్యం, బాబూరావు

దేవరాపల్లి : మండలంలోని ఎ. కొత్తపల్లిలో ముత్యమాంబ అమ్మవారి తీర్థం శుక్రవారం వైభవంగా జరిగింది. తెల్లవార జాము నుంచి గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలన్నీ భక్తులతో కిక్కిరిసాయి. ఈ సందర్భంగా అమ్మవారిని స్థానిక ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం, సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, వైస్ ఎంపీపీ ఉగ్రాకుల గంగాభవానీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు డా.వరదపురెడ్డి సింహాచలం నాయుడు, లలితానాయుడు, కె.వి.రమణ, ఎంపీటీసీ గౌరమ్మ, వంటాకు శ్రీను, ఉగ్రాకుల అప్పారావు, తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు. తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకుని మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. నాగయ్యపేట, వేచలం, వాకపల్లి గ్రామాల్లో కూడా గ్రామ దేవతల తీర్థ మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి.

డ్రైనేజీల ఆక్రమణపై ఫిర్యాదు


పంచాయతీ కార్యాలయంలో డ్రైనేజీల అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేస్తున్న వీధి వాసులు


కొట్టేవారి వీధిలో పూడికపోయిన డ్రైనేజీ

రోలుగుంట : మండల కేంద్రంలో మురుగుకాల్వలు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోను , స్థానిక పంచాయతీ కార్యాలయంలోను ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీ పరిధిలో గల ఆరో వార్డు కొట్టేవారి వీధిలో శ్రీవిజ్ఞాన కాన్వెంటు వద్ద, మరికొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ ఆక్రమణకు గురైంది. దీనివల్ల డ్రైనేజీ పూడుకుపోయి మురుగునీరు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. దీంతో కొన్నాళ్లుగా దోమలు విజృంభించి జనాన్ని రోగాల పాలు చేస్తున్నాయి. ఆక్రమణ తొలగించి పూడుకుపోయిన డ్రైనేజీని శుభ్రపరచాలని, రోగాలను నియంత్రించాలని గ్రామస్తులు కొట్టే సంజీవరావు, విజయ, అరిపి త్రినాథ్, ప్రసాద్, నాగమణి ఫిర్యాదులో పేర్కొన్నారు.

అపరాల సాగుపై దృష్టి సారించాలి


క్షేత్ర సందర్శన చేస్తున్న మండల వ్యవసాయ శాఖ అధికారి ఆదినారాయణ, తదితరులు

పాయకరావుపేట: మండలంలోని మాసాహెబుపేట, పెంటకోట గ్రామాల్లో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ క్షేత్ర సందర్శన చేశారు. అనంతరం రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. వ్యవసాయ పథకాల గురించి రైతులకు వివరించారు. వరి పొలాల్లో అపరాల సాగుపై దృష్టి సారించాలన్నారు.

వరిమడిలో తామర పురుగు బెడద

అనకాపల్లి: మారుతున్న వాతావరణ పరిస్థితులకు వరి నారుమడిలో తామర పురుగులు ఆశించే అవకాశం ఉన్నందున, లీట రు నీటికి మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. చొప్పు న కలిపి పిచికారీ చేసి నివారించవచ్చని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ సీహెచ్. ముకుందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరినారు మడిలో కనిష్ట ఉష్ణోగ్రతల వల్ల పైరు పెరగకుండా ఉన్నట్లయితే బూస్టర్ ఎరువులు 2 కేజీ యూరియా 2 కేజీ, పొటాష్ లేదా నీటిలో కలిపి ఎరువులు ఒక శాతం యూరియా లేదా 0.5శాతం మల్టీ కెను జింక్ సల్ఫేట్ 2 గ్రా/లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. రాగిపైరు నాటే రైతులు దుక్కిలో 26 కిలోల యూరియా, 75 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్, 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం


అవగాహన కల్పిస్తున్న రవాణా శాఖ అధికారులు

తుమ్మపాల: రోడ్డెక్కితే చాలు తిరిగి గమ్యానికి చేరుకునేంత వరకు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితులు ప్రస్తుతం నెలకొన్నాయి. డ్రైవింగ్‌పై పూర్తి అవగాహన లేకుండానే ప్రతి ఒక్కరూ వాహనాలు కొనుగోలు చేసి రోడ్లపై ప్రయాణించేస్తున్నారు. దీంతో రహదారులపై నిత్యం ట్రాఫిక్ చిక్కులు ఎదుర్కోవాల్సి వస్తోంది. దీనికి తోడు వాహన చోదకుల అవగాహనా రాహిత్యం కారణంగా ట్రాఫిక్ మరింత జటిలమవుతోంది. ప్రజలకు మరింత అవగాహన చేపట్టాలనే లక్ష్యంతో ఏటా జనవరి 16 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు రహదారుల భద్రత మాసోత్సవాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. రోడ్డుపై మద్యం సేవించి వాహనం నడిపేవారిని బ్రీత్ ఎనలైజర్ తోనూ, అధిక వేగంతో నడిపే వాహనాలను స్పీడ్ గన్‌తోనూ గుర్తిస్తారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ లేకుండా వాహనం నడపడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వంటి వారిపై రవాణా శాఖ, పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కేసులు నమోదు చేయనున్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన శిబిరాలు...

రోడ్డు భద్రతపై ఈ నెల 24న డ్రైవర్లకు హెల్త్ చెకప్ చేయించడం, 25న అవగాహన కార్యక్రమాలు చేపట్టడం, 26, 27 తేదీల్లో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసి వాకథాన్‌లు, 30, 31 తేదీల్లో బైక్ ర్యాలీలు నిర్వహిస్తారు. గోల్డెన్ అవర్, రహదారి భద్రత నిబంధనలపై అవగాహన చేపట్టేందుకు ప్రజలను సమాయత్తం చేస్తున్నారు.